## పిల్లర్ల దశకే పరిమితమైన ఇందిరమ్మ మోడల్ హౌస్



గంగాధరలో ఇందిరమ్మ మోడల్ హౌస్ పిల్లర్ల నిర్మాణం కోసం తవ్విన గుంతలు

గంగాధర, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ హౌస్ పిల్లర్ల దశకే పరిమితమైంది. నెల క్రితం భూమిపూజ చేసి పిల్లర్ల తీసిన అధికారులు, ఆ తర్వాత పనులు నిలిపివేశారు. మండల కేంద్రంలోనే మోడల్ హౌస్‌పూర్తి చేయని అధికారులు గ్రామాల్లో లబ్ధిదారుల ఇండ్లు ఎప్పుడు పూర్తి చేస్తారని మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు మాట్లాడుకోవడం కనిపించింది. దీనిపై సంబంధిత ఏఈ మహేందర్‌ను వివరణ కోరగా, మండలంలో ఇసుక దొరకకపోవడంతో నిర్మాణం ఆలస్యమైందని తెలిపారు. పైఅధికారులతో మాట్లాడి మోడల్ హౌస్‌ను పూర్తి చేస్తామని తెలిపారు.







కరీంనగర్, హుజూరాబాద్ డిపోల ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

## మా సమస్యలకు పరిష్కారమెప్పుడు?

తెలంగాణచౌక్, ఏప్రిల్ 4: తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని డిపో -2 ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజయ్య, కోశాధికారి అంజిరెడ్డి మాట్లాడుతూ, 2013, 2017 సవరించిన రెండు పేస్కేలు ఏరియర్స్ చెల్లించాలని, కనీస పెన్షన్ 9వేలుగా నిర్ణయించాలని, తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ మేరకు డీఎం విజయమాధురికి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు మోహన్‌రెడ్డి, నారాయణ, సంపత్ పాల్గొన్నారు.

హుజూరాబాద్, ఏప్రిల్ 4: హుజూరాబాద్ డిపో గేటు ఎదుట శుక్రవారం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా చేశారు. అనంతరం సూపరింటెండెంట్‌కు సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు వీవీఆర్ రెడ్డి, ఎల్ సారయ్య, శుభవర్ధన్, ప్రభాకర్ రెడ్డి, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, పీఎల్ రావు, వీడి రెడ్డి, పీ ఎస్ రెడ్డి, ఈవీఆర్ నరసయ్య, జీఎం రెడ్డి, వెంకటస్వామి, అప్పని నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఇండియన్ ఆర్మీ, నేవీలో ఉద్యోగాలు సాధించిన తేజస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు

## తేజస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థుల సత్తా

- ఇండియన్ ఆర్మీలో 102, నేవీకి 10 మంది విద్యార్థులు ఉద్యోగాల సాధన
- చైర్మన్ సతీశ్‌రావు వెల్లడి

కొత్తపల్లి, ఏప్రిల్ 4: కొత్తపల్లిలోని తేజస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు అగ్నివీర్‌లో మరోసారి సత్తాచాటారు. ఇండియన్ ఆర్మీ, నేవీ పరీక్షల్లో అద్భుత ప్రతిభ చూపి ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు సాధించినట్లు డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాల చైర్మన్ సీహెచ్ సతీశ్‌రావు తెలిపారు. స్థానిక తేజస్ జూనియర్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వివరాలు వెల్లడించారు. గతేడాది మార్చిలో గచ్చిబౌలిలో జరిగిన ఆర్మీ ర్యాలీలో అత్యున్నత మెరిట్ సాధించిన 102 మంది విద్యార్థులు ఇండియన్ ఆర్మీ ఉద్యోగాలకు, అదేవిధంగా గతేడాది జరిగిన నియామక ప్రక్రియలో ఇండియన్ నేవీ ఎస్ఎస్ఆర్ ఉద్యోగాలకు 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. అగ్నివీర్ పథకం ద్వారా ఆర్మీకి ఎంపికైన విద్యార్థులు ఈ నెల 5వ తేదీ నుంచి ఏఆర్‌వో సికింద్రాబాద్‌లో, నేవీకి ఎంపికైన విద్యార్థులు ఈ నెల 14న చిలుక ట్రైనింగ్ కేంద్రంలో రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రణాళికాబద్ధమైన విద్యనందించడంతో పాటు విద్యార్థులు ఫిజికల్‌గా ఫిట్‌నెస్ సాధించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు సతీశ్‌రావు తెలిపారు. అకాడమీ నంచి ఇప్పటి వరకు 2 వేలకు పైగా విద్యార్థులు డిఫెన్స్ రంగాల్లో ఉద్యోగాలు సాధించి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమంగా నిలిచారన్నారు. సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, కానిస్టేబుల్ ఉద్యోగాల్లో సైతం తమ అకాడమీకి చెందిన విద్యార్థులు ఎంపికయ్యేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్‌లో మరింత మంది విద్యార్థులు డిఫెన్స్ రంగాల్లో ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 4: ఆరు సంవత్సరాల్లోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని పర్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. నూతన సిలబస్, ప్రత్యేక శిక్షణ పొందిన టీచర్లతో అంగన్‌వాడీల్లో బోధిస్తున్నామని తెలిపారు. అలాగే పిల్లలు ఎత్తుకు తగిన బరువుతో ఆరోగ్యంగా ఎదిగేలా అంగన్వాడీల్లో శ్రద్ధ తీసుకుంటారని చెప్పారు. మహిళలు ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిత, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో విజయ్ కుమార్, సీడీపీవో శ్రీమతి, తదితరులు, పాల్గొన్నారు.

## స్మార్ట్‌సిటీ పనులు వేగంగా పూర్తి చేయాలి

కార్పొరేషన్, ఏప్రిల్ 4: నగరంలో స్మార్ట్ సిటీ కింద చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో తన చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులు, ఆర్వీ కన్సల్టెన్సీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిజిటల్ లైబ్రరీ, కశ్మీర్ గడ్డ సమీకృత మార్కెట్ తదితర పనులను త్వరగా పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. టవర్ సర్కిల్ ఆధునీకరణ పనులపై దృష్టి పెట్టాలన్నారు. వన్ టౌన్ జంక్షన్ పనులను పది రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పద్మనగర్ జంక్షన్, బొమ్మకల్ జంక్షన్ పనులను కూడా ప్రారంభించి, పూర్తి చేసేలా చూడాలని కోరారు. నగరంలోని రాజీవ్ పార్కులో సందర్శకుల కోసం కాంట్రాక్టర్‌తో బేంచ్‌లు ఏర్పాటు చేయించాలన్నారు. నగరంలోని డంపుయార్డ్ బయోమైనింగ్ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి రోజూ 12 గంటలు బయోమైనింగ్ యంత్రం నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ సంజీవ్, డీఈ లచ్చిరెడ్డి, అయూబ్‌ఖాన్, ఆర్వీ టీం లీడర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

**హోర్డింగ్ ఫీజుల వసూళ్లపై దృష్టి పెట్టాలి**

నగరంలో ఫీజు చెల్లించని ప్రకటన బోర్డులను తొలగించాలని కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో శుక్రవారం ప్రకటనల బోర్డులను పరిశీలించారు. కొన్ని ఏజెన్సీ సంస్థలు నగరపాలక సంస్థకు ఫీజు చెల్లించకుండా పెద్ద మొత్తంలో బకాయి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ వేణు, టీపీఎస్ తేజస్విని, సిబ్బంది పాల్గొన్నారు.

**సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు లక్ష్యం**

కేంద్రం చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కరీంనగర్‌కు మెరుగైన ర్యాంకు సాధించే లక్ష్యంతో ఆర్పీలు కృషి చేయాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం సమైఖ్య సంఘాలకు చెందిన మహిళా సభ్యులు, ఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి రోజూ ఉదయం సంఘ సభ్యులు 50 నుంచి 100 నివాస గృహాలకు వెళ్లి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. తడి చెత్తతో ఇంట్లోనే హోం కంపోస్టింగ్ చేసుకునేలా చూడాలన్నారు. అలాగే 10వ డివిజన్‌లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. నగర స్వచ్ఛతలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ స్వామి, టీఎంసీల అనిత, ఆర్పీలు, సీవోలు, పారిశుధ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ‘రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ కుట్ర’





జైబాపు యాత్రలో పాల్గొన్న మంత్రి పొన్నం

చిగురుమామిడి, ఏప్రిల్ 4: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్రలో భాగంగా మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, కరీంనగర్ అర్బన్ బ్యాంక్ చైర్మన్, మండల ఇన్‌చార్జి గడ్డం విలాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలి

గంగాధర, ఏప్రిల్ 4: ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ ఆర్టీసీ కార్గో ఇన్‌చార్జి రామారావు సూచించారు. శుక్రవారం గంగాధర బస్ స్టేషన్‌లో ఆర్టీసీ కార్గో సేవలను ప్రారంభించారు. గంగాధరలో ఏర్పాటు చేసిన కార్గో సెంటర్ ద్వారా మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోనూ పార్సిల్ సేవలు మెరుగుపడుతాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు వడ్లూరి శ్రీనివాసాచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రూప్1 పరీక్షలో ర్యాంకులు

గంగాధర, ఏప్రిల్ 4: టీజీపీఎస్సీ శుక్రవారం విడుదల చేసిన గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో ఎంపీడీవో దమ్మని రాము, ఎస్ఐ వంశీకృష్ణ ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఎంపీడీవో దమ్మని రాము 390, ఎస్ఐ వంశీకృష్ణ 390 ర్యాంకు సాధించారు. గ్రూప్1 ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారిని మండల ప్రజలు అభినందించారు.

## నర్సరీలో అవసరమైన మొక్కలు పెంచాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 4: గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీల్లో వనమహోత్సవంలో నాటే మొక్కలు పెంచాలని, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ షఫీ ఉల్లా సూచించారు. శుక్రవారం జిల్లాలో క్షేత్ర పర్యటన చేపట్టిన అనంతరం, నగరంలోని స్వశక్తి కళాశాలలో ఏపీవోలు, ఇతర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు పెరిగిన వేతనంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెలాఖరులోగా మొక్కల పెంపకానికి సంబంధించి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో తిరిగి నాటేందుకు నర్సరీలో రెండు మీటర్ల ఎత్తు వరకు మొక్కలు పెంచాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీధర్, ప్లాంటేషన్ ఇన్‌చార్జి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### గ్రామీణ యువత ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

నగరంలోని బ్యాంక్ కాలనీలో గల వోల్కసి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా గ్రామీణ యువతకు అందిస్తున్న మూడు నెలల ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన శిక్షణ కార్యక్రమాన్ని తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కమిషనర్, ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ మార్కెటింగ్ మిషన్ సీఈవో షఫీఉల్లా సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వోల్కసి టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మోతిలాల్ భార్గవ్, సెంటర్ మేనేజర్ మమత, ప్రత్యేకాధికారి నర్సింహారెడ్డి, రవీందర్, శిక్షకులు అనిల్, రాములు, రాజు, శ్రీనివాస్, మధుకర్, జ్యోతి, స్పందన, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వివేకానంద విద్యానికేతన్‌లో ‘స్వవికాస్’

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 4 : జిల్లా కేంద్రంలోని భగత్ నగర్ వివేకానంద విద్యానికేతన్ విద్యా సంస్థల్లో పిల్లల్లో ప్రవర్తన, విద్యా వికాసం ఎలా జరుగాలి అనే అంశాలపై తల్లిదండ్రుల కోసం ‘స్వవికాస్’ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అలాగే, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యానికేతన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన విధానంపై కౌన్సెలింగ్, ప్రీ ప్రైమరీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ మోటివేషనల్ ఉపన్యాసకుడు జగన్ గురూజీ తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులను విద్యలో ఎలా ముందుకు తీసుకెళ్లాలో తల్లిదండ్రులకు ప్రభావాత్మక, ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. వేదం పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, స్లేట్ స్కూల్స్ కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య సొగాని సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థుల సందేశాత్మక నృత్యాలు, ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే, చిన్నారుల పేరెంట్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు సుందర్, జనార్దన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వివేకానంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ సాగర్, ఏవో తుంగాని సంపత్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు


హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 4: వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ హెచ్చరించారు. శుక్రవారం కరీంనగర్ సీపీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలో నంబర్ ప్లేట్ లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 16 మైనర్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్ లేని 67 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఏసీపీ శ్రీనివాస్ జీ మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానిపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్ గౌడ్, రూరల్ సీఐ పులి వెంకట్ గౌడ్, జమ్మికుంట టౌన్ సీఐ వరగంటి రవి, ఎస్సైలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శంకరపట్నం, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో ఏఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఓ మైనర్ వాహనం నడుపుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం తల్లిదండ్రులను పీఎస్‌కు పిలిపించి ఎస్ఐ రవి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లు రోడ్లపై వాహనాలు నడిపితే తల్లిదండ్రులే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

## వరి కోతల సమయంలో ప్రమాణాలు పాటించాలి

శంకరపట్నం, ఏప్రిల్ 4: హార్వెస్టర్ యజమానులు వరి కోతల సమయంలో ప్రమాణాలు పాటించాలని తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. శుక్రవారం మండల తహసీల్ కార్యాలయంలో హార్వెస్టర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. వరి కోతల సమయంలో పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి సూచనలు చేశారు. సమావేశంలో ఎంఏవో వెంకటేశ్, గిర్దావర్‌లు బాలకిషన్, ప్రత్యూష, హార్వెస్టర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## విజన్ హైస్కూల్‌లో వీడ్కోలు వేడుకలు





వీడ్కోలు వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 4 : జిల్లా కేంద్రంలోని రేకుర్తి విజన్ హైస్కూల్‌లో ఫేర్ వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ హాజరై మాట్లాడారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులందరినీ అభినందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు వెంకట్, మల్లయ్య, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 4: సింగాపూర్ గ్రామంలోని కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. హనుమాన్ దీక్ష మాలతో ఉన్న వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ప్రమాదంలో సదరు వ్యక్తి ముఖం నుజ్జునుజ్జు అయి గుర్తుపట్టలేని విధంగా మారింది. మృత దేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ తెలిపారు.

## రైతులకూ రిజర్వేషన్లు కల్పించాలి

వీణవంక, ఏప్రిల్4: రైతులకు, రైతు కూలీలకు అన్ని రంగాల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలని రైతు ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు డిమాండ్ చేశారు. వీణవంక మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ అంశంపై జాతీయ స్థాయిలో త్వరలో హైదరాబాద్‌లో రైతు సంఘాల నాయకులు, మేధావులతో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని పేర్కొన్నారు. పారిశ్రామీకరణ వల్ల రైతులను చిన్నచూపు చూస్తున్న వైనంపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, రైతు కూలీలకు న్యాయం జరిగేంత వరకూ ఉద్యమిస్తూనే ఉంటామని తెలిపారు.

## టీజీ పేటా జిల్లా నూతన కార్యవర్గం

కొత్తపల్లి, ఏప్రిల్ 4 : టీజీ పేటా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అంతటి శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా చిరుత శ్రీనివాస్, కోశాధికారిగా కె శ్రీనివాస్, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌లుగా బి. జ్యోతి, ఏముల రవి కుమార్, జి. నిర్మల, సంయుక్త కార్యదర్శులుగా బి. శ్రీధర్, టి. భాగ్యలక్ష్మి, మహిళా కార్యదర్శిగా బి. వనితారావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారులుగా ఎస్జీఎఫ్ సెక్రటరీ వేణుగోపాల్, పరిశీలకులుగా సొల్లు సారయ్య వ్యవహరించారు.

## కమిషనర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 4: వంద శాతం ఆస్తి పన్ను వసూలుతో హుజూరాబాద్‌ను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపిన మున్సిపల్ కమిషనర్ కేంసారపు సమ్మయ్యకు అచీవర్ అవార్డు లభించింది. గురువారం రాత్రి హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీడీఎంఏ శ్రీదేవి ప్రశంసా పత్రాన్ని, అవార్డును అందజేశారు.

## రోడ్లపై ధాన్యం పోయొద్దు

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 4: హుజూరాబాద్ మండలంలో వరి కోతలు చేపట్టిన రైతులు రోడ్లపై వరి ధాన్యాన్ని పోయొద్దని హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని రైతులను ఉద్దేశించి తన కార్యాలయంలో మాట్లాడారు. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు.

## చిగురుమామిడి ఎస్ఐగా శ్రీనివాస్

చిగురుమామిడి, ఏప్రిల్ 4: చిగురుమామిడి మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఎస్. శ్రీనివాస్ శుక్రవారం స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. కరీంనగరలో ఎస్బీఐలో విధులు నిర్వహించిన ఆయన చిగురుమామిడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన బండి రాజేశ్ వీఆర్ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు.. కాగా, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, మండలంలో శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

గన్నేరువరం, ఏప్రిల్ 4: జంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆంగ్లంలో ప్రతిభ చూసి టెట్ఎడ్ న్యూయార్క్ నుంచి అప్రిసియేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు. హాసిని, సాత్విక, వర్షిణి, శ్రీజ, దీక్షిత ఆంగ్ల భాషలో వివిధ అంశాలపై అనర్గళంగా ఉపన్యాసించి వీడియోలను టెట్ఎడ్‌లో అప్‌లోడ్ చేయగా, వారి ప్రతిభను గుర్తించి, అభినందిస్తూ టెట్ఎడ్ అప్రిసియేషన్ సర్టిఫికెట్లు, అలాగే ఉపాధ్యాయులు వసుంధర, శ్రీనివాస్, రాజమౌళికి ఎడ్యుకేటర్ సర్టిఫికేట్లను జారీ చేసింది. శుక్రవారం మండల విద్యాధికారి రామయ్య ప్రధానోపాధ్యాయిని శారదతో కలిసి సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోగుల సేవలో నర్సుల పాత్ర కీలకం

విద్యానగర్, ఏప్రిల్ 4: దవాఖానల్లో రోగులకు సేవ చేయడంలో నర్సుల పాత్ర కీలకమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో చదవబోతున్న మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రతిజ్ఞ కార్యక్రమం గణేశ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నర్సింగ్ విద్యను పట్టుదలతో అభ్యసించి భవిష్యత్తులో వివిధ హోదాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ప్రభుత్వ జనరల్ దవాఖాన ఆర్.ఎం.ఓ నవీనా, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మల, ప్రిన్సిపాల్ అనిత, వైస్ ప్రిన్సిపాల్ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఇల్లందకుంట, ఏప్రిల్ 4: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పాత దేవాలయంలో ఉత్సవమూర్తుల వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాల మధ్య ఉత్సవమూర్తులను పల్లకీలో కొత్త దేవాలయంలోకి తీసుకువచ్చారు. స్వామివారి కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం చేసే కార్యక్రమాన్ని జిల్లా దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఆలయంలో ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాలయ ఈవో కందుల సుధాకర్, దేవాలయ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరాచార్యులు, దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 4: పట్టణంలో నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్ ద్వారా వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని, ఓవర్‌లోడ్ సమస్యలు ఉండవని ఇన్‌చార్జి డైరెక్టర్(ఆపరేషన్స్) టీ మధుసూదన్ అన్నారు. పట్టణంలోని కళాశాల మైదానం సమీపంలో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎం రమేశ్ బాబు, హుజూరాబాద్ డీఈ లక్ష్మారెడ్డి, కన్‌స్ట్రక్షన్ డీఈ చంద్రమౌళి, ఎంఆర్టీ డీఈ కాళిదాస్, ఏడీఈ శ్రీనివాస్, కన్‌స్ట్రక్షన్ ఏడీఈ అంజయ్య, ఏఈ శ్రీనివాస్ , సిబ్బంది పాల్గొన్నారు.

## ‘అద్విత’లో అలరించిన ‘కవితాగానం’

కమాన్ చౌరస్తా, ఏప్రిల్ 4 : జిల్లా కేంద్రంలోని అద్విత ఇంటర్నేషనల్ పాఠశాలలో కవితా గానం కార్యక్రమం శ్రోతలను అలరించింది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ అనుదీప్ సొగాని, ప్రిన్సిపాల్ మాధురి శ్వేత, వైస్ ప్రిన్సిపాల్ దివ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ, విద్యార్థులకు సాహిత్యంపై పట్టు ఉండాలని, అందుకోసం అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో ఫేర్‌వెల్ హంగామా

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 4: కరీంనగర్‌లోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ వేడుకలో భాగంగా విద్యార్థినులు ఆటపాటలతో హంగామా చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జూనియర్ విద్యార్థినులు, సీనియర్స్‌కు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూం ప్రారంభం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 4: ఎలబోతారం ప్రాథమికోన్నత పాఠశాలలో కలెక్టర్ ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను మండల విద్యాధికారి కే రవీందర్ శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కరీంనగర్ ఐ.ఎఫ్.పి(ఇంటిగ్రేటెడ్ ఫ్లెక్సిబుల్ ప్యానల్) అందించగా, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జే విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నార్మల్ డెలివరీపై అవగాహన కల్పించాలి

విద్యానగర్, ఏప్రిల్ 4 : నార్మల్ డెలివరీపై గర్భిణులకు అవగాహన కల్పిస్తూ వారిని ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆశ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం ఆశ ఫెసిలిరేటర్స్‌కు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధ, పీవోడీటీటీ డాక్టర్ ఉమా శ్రీరెడ్డి, డీఐవో డాక్టర్ సాజిదా, డెమో రాజగోపాల్, డీపీహెచ్ఎన్‌వో విమల, డీసీఎం రవీంద్రరెడ్డి, ఆశ ఫెసిలిటేటర్‌లు పాల్గొన్నారు.

## మొదలైన ధ్రువీకరణ పత్రాల జారీ

- ‘నమస్తే‘ కథనానికి స్పందన

కార్పొరేషన్, ఏప్రిల్ 4: ఆన్‌లైన్ సర్వర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ పది రోజులుగా నిలిచిపోవడంపై ఈనెల 3న నమస్తే తెలంగాణలో ‘నిలిచిన ధ్రువీకరణ పత్రాల జారీ’ శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. సంబంధిత సర్వర్‌లో వచ్చిన సమస్య పరిష్కరించారు. దీంతో శుక్రవారం నుంచి యథావిధిగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 4: నగరంలో కొత్త లైన్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్, టౌన్-2 ఏడీఈ లావణ్య వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి 10.30గంటల వరకు రాజీవ్ చౌక్, రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియా, భారత్ టాకీస్ ప్రాంతం, టవర్ సర్కిల్, బ్రాహ్మణ వీధి, అహ్మద్ పుర, ద్వారక నగర్, వాల్మీకి నగర్, ఉదయం 9నుంచి 11.30 గంటల వరకు కలెక్టర్ ఆఫీస్ ఏరియా, బస్ స్టాండ్, ముకరంపుర, ఎల్ఐసీ ఆఫీస్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## సామాజిక న్యాయ సాధన వారోత్సవాలు

తెలంగాణచౌక్, ఏప్రిల్ 4: సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా ఈనెల 6 నుంచి 14 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామాజిక వారోత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ పిలుపునిచ్చారు. నగరంలోని యూనియన్ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, సామాజిక ఉద్యమాన్ని ఉధృతం చేసే లక్ష్యంతో నిర్వహించ తలపెట్టిన వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముకుందరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేశ్, నాయకులు శ్రీనివాస్, శ్రీలత, మల్లయ్య పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణ

జమ్మికుంట, ఏప్రిల్4: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 7నుంచి కంప్యూటర్ ఫండమెంటల్స్‌పై ఉచిత వేసవి కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభంకానున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అధ్యాపకులు కిరణ్‌కుమార్, సుష్మ, రవిప్రకాశ్‌రావు, రమేశ్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

## కార్మికుల సమ్మె వాయిదా

విద్యానగర్, ఏప్రిల్ 4 : జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డ్స్, ప్లంబర్ కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలను చెల్లిస్తామని ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. వీరారెడ్డి ఇచ్చిన హామీ మేరకు కార్మికులు సమ్మెను విరమించారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉదయం కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. ఈ క్రమంలో వారి వద్దకు వచ్చిన సూపరింటెండెంట్, కార్మికుల పెండింగ్ వేతనాలపై డీఎంఇతో ఫోన్‌లో సంప్రదించారు. ఈ నెల 8లోగా మూడు నెలల జీతాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో వారు సమ్మెను విరమించి విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

WANTED
jobs Apply Now!
★ Wanted Sales Executives @ Karimnagar, Unic Chem Technologies to make Best Future in Water Treatment Plants & Chemicals. Ph: 9573244611, raju@unicchem.com
NT-330931

PASSPORT LOST
★ I, Kokkula Ramesh, S/o. Kokkula Mallesham, H.No. 11-2-7, B.Y. Nagar, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist, my Passport No. L2211280 Lost by travelling from my house to Busstand. If any one Find Please Call: 80081 56677.
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189